విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం — జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక


## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు




### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్,మార్చి1 (చట్టం న్యూస్) :** ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. యుద్ధం ముగిసేలోపు మరింత

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 • సంచిక : 50 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 3 మార్చి 2026 • పేజీలు : 8 • వెల 2/-

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

### ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్



**హైదరాబాద్,మార్చి2 (చట్టం న్యూస్) :** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ

మిగతా 2వ పేజీలో..

## ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటున్న దుబాయ్


### వరుస డ్రోన్ దాడులతో ప్రజల్లో భయాందోళనలు



**అబుదాబి,మార్చి1 (చట్టం న్యూస్) :** పర్యాటకులు, ధనవంతులు, వ్యాపారాలకు స్వర్గధామంగా గుర్తింపు పొందిన దుబాయి నగరం ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయింది. శనివారం నుంచి క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తున్న ఇరాన్.. ఆదివారం కూడా దాడి చేసింది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని దుబాయి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిత్యం ప్రశాంతంగా ఉండే నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు, మంటలు, ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చాలామంది స్థానికులు, పర్యాటకులు దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లన్నింటినీ కూల్చివేశామని ప్రకటించింది. అయితే, జెబెల్ అలీ

మిగతా 2వ పేజీలో..

## కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు




- బాంబు దాడిలో ధ్వంసమైన గాంధీ ఆస్పత్రి
- 165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు

**టెహ్రాన్,మార్చి1(చట్టం న్యూస్) :** అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి. దట్టమైన పొగలు వెలువడటంతో హాస్పిటల్ లో ఉన్న రోగులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో

మిగతా 2వ పేజీలో..

## రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

### నేలపాడులో నిర్మాణాల పరిశీలన




**అమరావతి,మార్చి2 (చట్టం న్యూస్) :** వైసిపి ప్రభుత్వం అవలంబించిన మూడు ముక్కలాట ధోరణితో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. సోమవారం మంత్రి రాజధాని అమరావతిలో పర్యటించారు. నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1, టైప్ -2, గ్రూప్ డి ఉద్యోగుల క్వార్టర్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, మొత్తం 4,026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో ప్రైవేట్ సంస్థలు కూడా నిర్మాణ పనులు ప్రారంభించాయన్నారు. నిర్మాణ సంస్థలు తమకు నిర్దేశిరచిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేశాయని, టార్గెట్ ప్రకారం పనులు చేయని షాపూర్జీ పల్లోంజి నిర్మాణ సంస్థ మేనేజ్ మెంట్ తో మాట్లాడుతున్నామని మంత్రి చెప్పారు. షాపూర్జీ పల్లోంజి యాజమాన్యం 5 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా 'వేతనాల చెల్లింపు పై ఎలాంటి సమస్యా లేదని, కార్మికులు మంచినీరు కోసం ఆందోళన చేయగా

మిగతా 2వ పేజీలో..

## కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

### తామే కూల్చామని ఇరాన్ ప్రకటన



**కువైట్,మార్చి1 (చట్టం న్యూస్) :** అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన

మిగతా 2వ పేజీలో..

# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

- ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి
- బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన



**అమరావతి,మార్చి2(చట్టం న్యూస్) :** ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు

మిగతా 2వ పేజీలో..

## మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి

- బయటపడుతున్న మోడీ దుర్మార్గ చర్యలు
- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు
- మోడీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్
- శంషాబాద్‌లో రాహుల్‌కు స్వాగతం పలికిన రేవంత్

**వికారాబాద్,మార్చి2 (చట్టం న్యూస్) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు



మిగతా 2వ పేజీలో..

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

### శంషాబాద్ నుంచి పలు విమానాల రద్దు




**హైదరాబాద్,మార్చి1 (చట్టం న్యూస్) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ నుంచి విదేశాలకు వెళ్లాల్సిన అనేక విమానాలు రద్దయ్యాయి. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా విమానాయన సంస్థలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దోహా, అబుదాబి, జెడ్డా, సౌదీ అరేబియా వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. అలాగే కువైట్, దుబాయ్, మస్కట్, మదీనా వెళ్లే సర్వీసులు కూడా తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన సుమారు 22 విమానాలు రద్దు కాగా, వివిధ దేశాల నుంచి రావాల్సిన మరో 22

మిగతా 2వ పేజీలో..

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

4లో..



## విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

### జ్ఞాపిక బహుకరణ

**నాగర్ కర్నూలు,మార్చి2(చట్టం న్యూస్) :** సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు కలిసి అభినందించారు. బల్మూరు మండలం తుమ్మన్ పెట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో నూతన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. తమ అభిమాన

మిగతా 2వ పేజీలో..



## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

మొదటి పేజీ తరువాయి..

మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో 200 మంది మరణించినట్లు తెలిసింది. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

మొదటి పేజీ తరువాయి..

చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

మొదటి పేజీ తరువాయి..

సమస్యను పరిష్కరించడం..' జరిగిందని అన్నారు.ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో వైసిపి ప్రభుత్వం తనపై కూడా కేసులు పెట్టిందని మంత్రి చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ లో 2001 లో తనకు చెందిన 60 సెంట్ల స్థలం కూడా పోయిందని, విజయవాడ సమీపంలో ఈడుపుగల్లులో ఉన్న తన స్థలం గుండా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుందని చెప్పారు. మా వాళ్ళు బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సి ఆర్ డి ఎ అధికారులు మీ స్థలం లేదని చెప్పారన్నారు. కేసు కోర్టులో ఉన్నందున తాను ఎలాంటి వ్యాఖ్యానాలు చేయనున్నారు.

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

మొదటి పేజీ తరువాయి..

విమానాలు కూడా రద్దయ్యాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, కతార్ ఎయిర్‌వేస్ వంటి విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేశాయి. విమానాల రద్దుతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాలు ప్రయాణికుల లేక వెలవెలబోతున్నాయి. ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక సూచన జారీ చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని...్ల ÷÷-లట్ స్టేటస్‌ను ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌లు, ఎయిర్‌పోర్ట్ అధికారుల ద్వారా తెలుసుకోవాలని డీజీసీఏ సూచించింది.

## ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటన్న దుబాయ్

మొదటి పేజీ తరువాయి..

పోర్టు సమీపంలో ఇరాన్ ప్రయోగించిన ఓ డ్రోన్ పడి భారీగా మంటలు చెలరేగాయి. దుబాయి గగన రక్షణ వ్యవస్థ కూల్చివేసిన ఇరాన్ డ్రోన్ శకలాలు పడటంతో పామ్ హోటల్‌లో స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని, వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ దాడితో దుబాయిలోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందిన బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లకు ముప్పు ఏర్పడింది. శనివారం రాత్రి ఇరాన్ డ్రోన్ శకలాలు బుర్జ్ అల్ అరబ్ భవనాన్ని తాకటంతో అది స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఈ రెండు భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు భారీ పేలుళ్లు వినిపించాయని స్థానికులు చెప్పారు. కృత్రిమంగా సృష్టించిన విలాసవంతమైన పామ్ జుమైరా దీవిలో కూడా డ్రోన్ పడటంతో మంటలు చెలరేగాయి. కాగా, నగరంలో పరిస్థితి అంతా మామూలుగానే ఉందని దుబాయి మీడియా కార్యాలయం ప్రకటించింది. అత్యవసర వైద్యసేవల కోసం దుబాయిలో 1,200 పడకల రషీద్ ప్రభుత్వాసుపత్రిని సిద్ధం చేసినట్లు అక్కడ సేవలందిస్తున్న ఓ భారతీయ వైద్యుడు చెప్పారు. 400మంది నర్సింగ్ సిబ్బంది, 200మందికిపైగా వైద్యులను ఉంచినట్లు తెలిపారు. నగరంలో వందలకొద్దీ అంబులెన్సులను సిద్ధంగా ఉంచారని అన్నారు. దుబాయిలో పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ఆదివారం మధ్యాహ్నానికి పేలుళ్లు పెరిగాయి. అయినా పరిస్థితి అదుపులోనే ఉంది. సామాన్య జనజీవనానికి పెద్దగా అంతరాయాలు ఏమీ లేవు. ఇళ్లకే పరిమితమయ్యాం. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతున్నా, ఇక్కడి ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది. యూఏఈ ఇప్పటికే ఎన్నో జాగ్రత్త చర్యలు చేపట్టింది.

## కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

మొదటి పేజీ తరువాయి..

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్ యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. ఓ వైపు బాంబు దాడులు జరుగుతున్నా నర్సులు తమ ప్రాణాలకు తెగించి ఇన్సులేటర్లలో ఉన్న నవజాత శిశువులను, ఐసీయూలోని చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ స్పందించారు. ఆసుపత్రులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలావుంటే ఇరాన్‌లోని మినాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 165కి పెరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్‌లోని షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఈ దాడి జరిగింది. 96 మంది గాయపడ్డారని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ నివేదించింది. దాడి జరిగిన ప్రదేశంలో శోధన, రక్షణ చర్యలు ముగిశాయని మినాబ్ కౌంటీ గవర్నర్ తెలిపారు. బాలికల పాఠశాలపై దాడి వార్తలను ఇజ్రాయిల్ ఖండించింది. నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ట్విట్టర్‌లో దాడికి సంబంధించిన ఫోటోను పంచుకున్నారు. ఇజ్రాయిల్, అమెరికా శనివారం ఇరాన్‌పై ఉమ్మడి దాడిని ప్రారంభించాయి. ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరియు ఇతర సీనియర్ సైనిక అధికారులు మరణించారు.

# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి..

సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9



రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతుకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య,

బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసి వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

# కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

మొదటి పేజీ తరువాయి..

దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్-15 ్గ÷టైర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్‌దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మద్దతు కలిగిన ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ప్రారంభించింది

# అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌కు డాక్టరేట్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 2 ,(చట్టం బ్యూరో) :** కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ప్రస్తుతం పోలీస్ శాఖలో సేవలందిస్తున్న బోనాల కిషన్ కు డాక్టరేట్ పి.హెచ్. డి లభించింది.ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బోనాల కిషన్ క్రిమినల్ జస్టిస్ సిస్టం ఇన్ ఇండియా ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు ల అండ్ స్ట్రాటజీస్ ఫర్ ద ప్రొడక్షన్ ఆఫ్ ఫిట్నెస్ భారత నేర శిక్షా స్మృతి సాక్షుల రక్షణ కోసం చట్టాలు వ్యూహాలపై అధ్యయనం అనే కీలక అంశంపై తన పరిశోధనలు పూర్తి చేశారు.న్యాయ శాస్త్ర విభాగ విశ్రాంతి ఆచార్యులు ఆచార్య వై పద్మజారాణి పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధనలు విజయవంతంగా ముగించారు హన్మకొండకు చెందిన డాక్టర్ బోనాల కిషన్ ప్రస్తుతం అడిషనల్ ఎస్పీ హోదాలో ఉన్నారు. ఆయన ప్రస్తుతం హనుమకొండలోని టీజీ ఎంపీడీసీఎల్ లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతో



బిజీగా రక్షణ పై ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడు తున్నారు. సాధించిన బోనాల కిషన్ ను విశ్వవిద్యాలయం బోధన బోధనేతర సిబ్బంది తోటి పరిశోధకులు ఘనంగా అభినందించారు .భవిష్యత్తులో న్యాయ పోలీస్ వ్యవస్థలకు ఎంతో దోహదపడుతున్నాయి మేధావులు అభిప్రాయ పడుతున్నారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల ఆయన మిత్రులు కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందల్ లో హర్షం వ్యక్తం చేశారు.

## యువజన కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 2 ,(చట్టం బ్యూరో) :** వేములవాడ లోని ఏరియా ఆసుపత్రి నందు జక్కిడి శివ చరణ్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా ఆసుపత్రి లోని రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది మరియు శివ చరణ్ రెడ్డి గారు ఆయురారోగ్యాలతో తెలంగాణ రాష్ట్ర ప్రజల సేవలో ఉండాలని ఈ సందర్భంగా వెంకటేష్ ఆ భగవంతున్ని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, రత్నంపేట ఉపసర్పంచ్ రామంచ యోన బాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం మురళీకృష్ణ, కొనరావుపేట మండల అధ్యక్షులు బండి ప్రభాకర్, వేములవాడ అర్బన్ ఉపాధ్యక్షుడు బొమ్మ తిరుపతి, ఇర్ఫాన్ షేక్, అక్కి సునీల్, షాహిద్ పాషా, భాను, వినీత్ తదితరులు పాల్గొన్నారు.


## విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

మొదటి పేజీ తరువాయి..

నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి.స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతిస్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

మొదటి పేజీ తరువాయి..



తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి సాయం

### ఆర్టీజీఎస్ అధికారులకు బాధ్యతలు

**అమరావతి,మార్చి2 :** ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో వివిధ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారికి సహాయం చేయాలని ఏపీ ప్రభుత్వ నిర్ణయించింది. అందుకు సంబంధించి ఎన్ఆర్‌టీ, ఆర్టీజీఎస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని.. పౌరులు సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. వేలాది మంది భారతీయులు అక్కడ చిక్కుకుపోయారు. వారిని సహాయం అందించడంతోపాటు సురక్షితగా వెనక్కి తీసుకు వచ్చేందుకు భారత విదేశాంగ శాఖ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అలాగే తెలుగు వారిని ఆయా రాష్ట్రాలకు తీసుకు వచ్చేందుకు ఇరు ప్రభుత్వాలు ఇప్పటికే చర్యలు చేపట్టాయి. అందుకోసం హెల్ప్ లైన్ నెంబర్లతోపాటు వాట్సప్, ఈ మెయిల్ ద్వారా తమను సంప్రదించాలంటూ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే వాటిని విడుదల చేశాయి.

## ప్రజలకు,గవర్నర్, సిఎం హోళీ శుభాకాంక్షలు

**హైదరాబాద్,మార్చి2 :** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోళీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

# చట్టాలు సక్రమంగా కావాలి



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మార్చి 2 చట్టం ప్రతినిధి :** ఈరోజు ఏలూరు జిల్లా, విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారులనుకు ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, అయ్యంకి సురేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ మీర్జాఫర్ ఆలీ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలు, స్వర్ణ గ్రామ వార్డు సచివాలయాలలో విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12 సబ్ సెక్షన్ 1 క్లాజ్ సి అనుసరించి ప్రవేట్ అండ్ కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మరియు షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, హెచ్ఐవి, వ్యాధిగ్రస్తుల పిల్లలకు చట్టబద్ధంగా మంజూరు చేయవలసి ఉన్న 25 శాతం సీట్లను నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా భర్తీల నిమిత్తం ఉత్తర్వులు ఇచ్చి ఉన్నందున ఇట్టి ఉత్తర్వులు విద్యాశాఖ అధికారులు మరియు జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి ఆయా శాఖల అధిపతులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఉత్తర్వులు నామమాత్రపు షరతులుగా విధి నిర్వహణ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆర్గనైజేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా విద్యాశాఖ అధికారిని యం. వెంకటేశ్వరమ్మ, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, జిల్లా పరిషత్ సీ.ఈ.వో. శ్రీహరి వార్కి నిర్లక్ష్యం తగదని ఇండియన్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపి, ప్రతి గ్రామంలోని స్వర్ణ గ్రామ వార్డు కార్యాలయాలు, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలలో" ఉచిత సీట్ల నమోదు అర్జీలు ఆన్లైన్ చేయాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ అండ్ కార్పొరేట్ స్కూల్స్ లోని ఒకటి నుండి పదవ తరగతి వరకు 25% సీట్లను కూడా భర్తీ నిమిత్తం ఉత్తర్వులు మంజూరు చేయాలని సిఫార్సు చేయవలసిందిగా అధికారులను కోరారు, ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ ఆర్గనైజేషన్ సభ్యులు అభిలాష మేరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్యాలయం నందు 25% సీట్ల భర్తీ నిమిత్తము ప్రచార యోగ్యమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి యున్నారు, జిల్లా పరిషత్ సీ.ఈ.ఓ.వారు జిల్లాలోని అన్ని స్వర్ణ వార్డు కార్యాలయాల్లో అప్లికేషన్లు ఆన్లైన్ నిమిత్తం ప్రత్యేకమైన ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలియజేశారు, ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపిన రీతిగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం నందు 25 % సీట్లు భర్తి కోరకు ప్రత్యేక ప్రచార బోర్డ్స్ ఏర్పాటు చేస్తామని, సి.ఈ.ఓ. తెలియజేశారు,ఇట్టి అవకాశాన్ని పేద విద్యార్థులు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ మీర్జాఫర్ అలీ, ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, ప్రేమ్ నరసింహన్, యశ్వంత్ కుమార్, లక్ష్మి, తదితరులు కోరారు.

# ఉద్యాన సహాయకులతో వ్యవసాయ అధికారి సమీక్ష



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మార్చి 2 చట్టం ప్రతినిధి :** అగిరిపల్లి మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది కి జిల్లా వ్యవసాయ అధికారి వాఖ. హబీబ్ భాషా గారు శాఖా పరమైన కార్యక్రమముల పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతు గ్రామ ఉద్యాన, వ్యవసాయ రైతులకు చిరుధాన్యాల సాగు పై అవగాహన కల్పించి చిరుధాన్యాలు సాగు విస్తీర్ణమును పెంచేలా కృషి చేయాలని అలాగే పంట నమోదు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు సేవలు అమలు చేస్తున్నాయి అయితే ఈ పథకాలు అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చేలా ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నారు.

అగిరిపల్లి మండలం లోని రైతు సేవ కేంద్రాల్లో ఇంకా రైతు విశిష్ట సంఖ్య కొరకు నమోదు చేసుకొని, మిగిలి న రైతులందరికి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయవలసి ఉన్నదని వారికి కూడా త్వరగా రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బందికి సూచనలు ఇచ్చి ఉన్నారు.

రైతులకు జారీ చేసే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పిఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, వ్యవసాయ పరికరాలపై రాయితీలు, పంట నష్టపరిహారం వంటి పథకాలు అందాలంటే ఈ విశిష్ట సంఖ్య అవసరమని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జీ. భవాని గారు మరియు అగిరిపల్లి మండలం లోని రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్యభట్ట స్కూల్ యాజమాన్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు...



- **తన కుమారునీ పై అత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి...**
- **ఈ సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కు విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు..**



**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, మార్చి 2 (చట్టం న్యూస్) :** తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ఆర్యభట్ట ప్రైవేట్ పాఠశాల లో చదువుతున్న పెద్దవంగర మండలానికి చెందిన ధారావత్ హర్షవర్ధన్, పై పాఠశాల యాజమాన్యం అత్యాయత్నానికి ప్రయత్నించిందని, సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్ లో విద్యార్థి తండ్రి ధారావత్ సురేష్ తల్లి అనిత, ఆర్యభట్ట పాఠశాల కరస్పాండెంట్ పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదులో ఆర్యభట్ట స్కూల్లో తన కుమారుడి పైన జరిగిన అత్యాయత్నం పై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని అదేవిధంగా పాఠశాల కరస్పాండెంట్ తన ధన బలంతో రాజకీయ పలుకుబడితో ఈ ఘటనను పక్క దారి పట్టిస్తున్నారని, అధికారులకు, ముడుపులు అప్పజెప్పి కేసు పై సాక్షాదారాల్లేకుండా చేయుటకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున ఈ ఘటనపై న్యాయ విచారణ చేపట్టి ఆర్యభట్ట కరస్పాండెంట్ మధుకర్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేసి, పాఠశాలను మూసివేయాలని, విద్యార్థి తల్లిదండ్రులు, పత్రికా ప్రకటనలో తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో కాముని దహనం





**అందోల్ మండల్ ప్రతినిధి మార్చ్. 2 (చట్టం)న్యూస్ :** జోగిపేట పట్టణపురోహితుల సూచన మేరకు ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో10వ వార్డు లో అనతిగా వస్తున్న ఆచారం ఆనవాయితీ ప్రకారం కాముని దహన కార్యక్రమంను భక్తిశ్రద్ధలతో స్థానిక శ్రీ మాణిక్య ప్రభు మందిర్ కూడలి వద్ద ఆదివారం అర్ధరాత్రి ఆ వార్డు మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.గత దశాబ్దాల కాలంగా అదే కూడలిలో కాముని దహనం చేయడం ఆనవాయితీ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కాముడీ దహనం చేయడం జరిగింది.వార్డుకు చెందిన పెద్దలు యువకులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గొల్ల శరత్ బాబు,బీర్ల శంకర్,ఉలువల సతీష్,వడ్ల నాగభూషణం, ఊస మాణిక్యం,ఎనాగేష్ మాసగొని, రవి,జోగినాథ్, నాగరాజ్, మల్లేశం, రాముచందర్ ప్రభాకర్,సుధాకర్, శ్రీను,లడ్డు, పురుషోత్తం, మహేష్,అంజి, శివకుమార్, లక్ష్మణ్, సంతోష్,అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్న సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 2 ,(చట్టం బ్యూరో) :** బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామం లో గత కొన్ని సంవత్సరాలుగా చేడిపోయి మూత పడ్డ వాటర్ ప్లాంట్ తిరిగి ప్రారంభించడం జరిగింది. గ్రామంలో వాటర్ కు సంబంధించి గేట్ వాల్స్, పైపు లైన్ లీకేజీలు , మరియు హైండ్ బోర్లు రిపేర్ చేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, తాజా మాజీ యంపిటిసి అక్కనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, గంగాధర గంగజమున, అక్కనపల్లి మధుకర్ వివిధ సంఘాల నాయకులు గంగాధర తిరుపతి, చిలుముల రమేష్, ఎర్ర గంగయ్య, కొట్టేపల్లి అనిల్, చంద్రగిరి శ్రీనివాస్, పొన్నం అరవింద్, ఎర్ర ఉదయ్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీతారాంపురం నందు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**మహబూబాబాద్ జిల్లా మరిపెడ, మార్చి 2, చట్టం న్యూస్ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీతారాంపురం నందు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ అర్జున్ నాయక్ తెలిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులు అయి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుగులోత్ మంగీలాల్ లింగాల మహేష్ గౌడ్, వెంకటేశ్వరరావు, సందీప్,కవిత,ఆదిలక్ష్మి,సారిక పాల్గొనగా స్వయం పరిపాలన దినోత్సవంలో విధ్యార్థులు రీజినల్ జాయింట్ డైరెక్టర్ గా మణితేజ్,జిల్లా విద్యాశాఖ అధికారిగా,కె.సాత్విక మండల విద్యాశాఖ అధికారిగా అద్విత, ప్రధానోపాధ్యాయిరాలుగా హర్షిత,ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

# ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి



**నార్పల మార్చి 2, (చట్టం) న్యూస్ :** నార్పల మండలం పప్పూరుకు వెళ్ళు రహదారులు మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారిందని ప్రజలు,వాహనదారులు వాపోయారు.నార్పల నుంచి నాయనపల్లి కి వెళ్ళు రహదారి గుంతలతో నిండి ఒక్కోటి ఐదు అడుగుల వెడల్పు,రెండు అడుగులు లోతు ఉండముతో వాహనదారులు ప్రజలు, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సింది వచ్చింది వాపోతున్నారు. పలుమార్లు వాహనదారులు యాక్సిడెంట్ కాళు చేతులు విరిగి ప్రాణాలు పోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం చాలా దారుణమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు



# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం




అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకోవడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదిరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్దంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టించింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్దంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ది చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్ఘాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హుసేన్ మొహ్‌సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తరిఉగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

## లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి

**బీరూట్,మార్చి1** : లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. లెబనాన్‌లోని దాదాపు 50 గ్రామాల ప్రజలను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం కోరింది. ఆ తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకారం తీర్చుకుంది. బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్ క్షిపణి మరియు డ్రోన్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ హత్య, పునరావృత ఇజ్రాయిల్ దురాక్రమణలకు ప్రతీకారంగా లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సరిహద్దు దాటి క్షిపణులు ప్రయోగించింది. ఈ మేరకు హెజ్బుల్లా ఒక ప్రకటనను విడుదల చేసింది. ఒక సంవత్సరానికి పైగా కాలం తర్వాత హెజ్బుల్లా ఇజ్రాయిల్‌పై దాడి చేసినట్లు ప్రకటించుకోవడం ఇదే తొలిసారి. ఈ దాడిలో ఒక ప్రక్షేపకాన్ని అడ్డుకున్నామని, మరికొన్ని బహిరంగ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయిల్ రక్షణ దళాలు తెలిపాయి. ఈ ఘటనల్లో ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. 2024లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీని ద్వారా ఇజ్రాయిల్ మరియు హెజ్బుల్లా మధ్య ఏడాదికిపైగా కొనసాగిన ఘర్షణలకు ముగింపు పలికింది. ఆ సమయంలో ఇజ్రాయిల్ దాడులు హెజ్బుల్లాను గణనీయంగా బలహీనపరిచినట్లు విశ్లేషకులు భావించారు. అయితే, అప్పటి నుంచి ఒప్పంద ఉల్లంఘనలపై ఇరుపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా, బీరూట్ దక్షిణ శివార్లలో వేలాది హెజ్బుల్లా మద్దతుదారులు ఇరాన్ సుప్రీం నాయకుడికి నివాళులర్పించారు.

# మార్చి 3న చంద్రగ్రహణం

## తిరుమలతో పాటు టిటిడి ఆలయాల మూత



**తిరుపతి,మార్చి2 :** చంద్రగ్రహణం కారణంగా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తారు. తిరిగి బుధవారం వేకువ జామున సంప్రోఓణ అనంతరం తెరుస్తారు. అలాగే ఉదయం తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని టిటిడి స్థానికాలయాలను మార్చి 3వ తేది మూసివేస్తారు. తిరిగి మార్చి 3వ తేది రాత్రి ఆలయాల తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మార్చి 3వ తేది మంగళవారం మధ్యాహ్నం 3.20 నుండి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీ శ్రీనివాస ఆలయాలను మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు తలుపులు తెరుస్తారు. శుద్ధి, పుణ్యాహవచనం ఇతర కైంకర్యాల అనంతరం సర్వదర్శనానికి అనుమతిస్తారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 తెరిచి, శుద్ధి, పుణ్యాహవచనం ఇతర కైంకర్యాల అనంతరం రాత్రి 9 గంటలకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం, అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. నారాయణవనంలోని శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి, కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి, నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి, బుగ్గలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సత్రవాడలోని శ్రీ కరివరదరాజస్వామి ఆలయం, నగరిలోని శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసి, రాత్రి 7:30 గంటలకు తెరుస్తారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తదితర సేవల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం, వాయల్పాడులోని శ్రీ పట్టాభిరామస్వామి ఆలయం, కోసువారిపల్లిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసే రాత్రి 7:30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

-----------

# ముస్తాబయిన రాధాకృష్ణుల ఆలయం

## విభిన్నంగా గిరిజనుల హోలీ జాతర

**విజయనగరం,మార్చి2** : చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రం బీటాలైన్‌లో గల రాధాకృష్ణుల ఆలయం హోలీ జాతరకు ముస్తాబయింది. ఇక్కడ ఏటా హోలీని విభిన్నంగా జరుపు కుంటారు. తాజంగి పంచాయతీ బీటాలైన్‌లో ఒడిశా నుంచి వలస వచ్చిన 300 కుటుంబాల ఆదివాసీలు సుమారు 85 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. స్థానిక గిరిజనులు గ్రామంలో రాధాకృష్ణుల ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏటా హోలీ రోజున పండుగ జరుపుకుంటున్నారు. ఆదివాసీలు ప్రతీ ఏడాది హోలీకి ముందు రోజు నుంచి స్థానిక రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలీని పురస్కరించుకుని సంప్రదాయంగా భక్తులు ఆలయం ఎదుట 70 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కర్రల పోగును మంగళవారం కాలుస్తారు. ఆ వేడుకలో స్వయంగా పాల్గొనేందుకు పలు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.
ఆరేళ్ల క్రితం ఆలయాన్ని ఆధునికీకరించారు. అయితే బీటాలైన్ ఆదివాసీలు విభిన్నంగా జరుపుకునే హోలీ వేడుక పూర్వం నుంచి కొనసాగుతున్నది. ఈ ఏడాది హోలీ వేడుకలకు రాధాకృష్ణుల ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు హోలీ సంబరం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కర్రల పోగును కాల్చే వేడుకను నిర్వహిస్తారు. ఇప్పటికే స్థానిక భక్తులు 70 అడుగుల కర్రల పోగును సిద్ధం చేశారు. ఈ కర్రల పోగును మంగళవారం ఉదయం ఐదు గంటలకు కాలుస్తారు. ఈ కర్రల పోగుపైన ఒక జెండాను తాడుతో ఎగురవేస్తారు. ఈజెండాను పట్టుకోవడానికి కర్రల పోగు చుట్టూ యువ భక్తులు నిరీక్షిస్తుంటారు.
ర్రలపోగు కాలిపోయి జెండా గాలిలోకి ఎగురుతుంది. ఈ జెండాను పట్టుకున్న వ్యక్తిని భక్తులందరూ ఎత్తుకుని అతని గృహం వరకూ గిరిజన సంప్రదాయ నృత్య కళాప్రదర్శనలతో తీసుకొస్తారు. జెండాను పట్టుకున్నవ్యక్తికి ఆలయ కమిటీ నగదు బహుమతిగా రూ.1116 అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ జెండాను పట్టుకున్న కుటుంబానికి ఏడాదంతా శుభం జరుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ప్రాంత గిరిజనులందరూ ఈ జెండా పట్టుకున్న వ్యక్తితోనే రానున్న ఖరీఫ్ సాగులో తొలి విత్తనాల నాట్లు వేయిస్తారు. జెండా పట్టుకున్న వ్యక్తితో నాట్లు వేయిస్తే అధిక దిగుబడులు వస్తాయనేది ఆదివాసీల విశ్వాసం. బీటాలైన్‌లో ప్రతి ఏటా జరిగే హోలీకి మరో ప్రత్యేకత వుంది. సుమారు 20 ఏళ్ల క్రితం హోలీ పండుగ సమయంలో ఇష్టమైన అమ్మాయి చేయిపట్టుకుని గృహానికి తీసుకువెళితే వారిద్దరికీ వివాహమైనట్లుగా గిరిజనులు భావించేవారు. ప్రతి ఏటా ఈ హోలీ పండుగ సమయంలో సుమారు 20 – 30 జంటలు చేయి పట్టుకునే పద్ధతిలో కలిసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మహిళా చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడం, చట్టాలను మరింత కఠినతరం చేయడంతో ఈ చేయిపట్టుకుని తీసుకువెళ్లే ఆచారానికి స్థానిక గిరిజన యువత పూర్తిగా స్వస్తి పలికింది.

# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

### క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

**హైదరాబాద్,మార్చి2 :** ఇరాన్–ఇజ్రాయెల్ మద్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్థరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

### తెలంగాణ వారి కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ,మార్చి2 :** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24లీ7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

### లెబనాన్‌పై దాడిలో హిజ్బుల్ చీఫ్ మృతి   సౌదీ వార్త 'అల్ హదత్' ధృవీకరణ

**లెబనాన్,మార్చి2 :** పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన భీకరవైమానిక దాడుల్లో లెబనాన్ పార్లమెంట్‌లోని హెజ్‌బొల్లా బ్లాక్ అధిపతి మహ్మద్ రాడ్ మరణించారు. ఆయన మృతి చెందినట్లు సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్త 'అల్ హదత్' పేర్కొంది. దక్షిణ లెబనాన్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా స్థావరాలపై సోమవారం ఇజ్రాయెల్ రక్షణ దళంవైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో మహ్మద్ రాడ్ మృతి చెందారు. ఈ ఉగ్రసంస్థకు చెందిన మరికొందరు ఉన్నతాధికారులు కూడా తమ దాడుల్లో మృతి చెందారని ఐడీఎఫ్ తెలిపింది. అయితే వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 31 మంది మృతిచెందగా.. 149 మంది గాయపడినట్లు లెబనాన్ ప్రకటించింది. హెజ్‌బొల్లా నేతలు లెబనాన్ రక్షణ కంటే ఇరాన్ కోసం ఎక్కువ పని చేశారని, వారి చర్యలకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఐడీఎఫ్ అధికారి రఫీ హెచ్చరించారు. మొదట హెజ్‌బొల్లా తమపై రాకెట్ దాడులకు పాల్పడడం వల్లే ప్రతి దాడులు చేశామని ఆయన తెలిపారు. మరోసారి వారు ఇటువంటి చర్యలకు దిగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా.. లెబనాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, కీలక నేతల కార్యాలయాలపై దాడులు చేపట్టామన్నారు. హెజ్‌బొల్లా రాజకీయ, సైనిక విభాగాల్లో కీలక పాత్ర పోషించే రాడ్ మృతి ఆ సంస్థకు కోలుకోలేని దెబ్బని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హెజ్‌బొల్లా ఆయుధాలను, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ 'ఆపరేషన్ రోరింగ్ లయన్'ను వేగవంతం చేసింది. మరిన్ని దాడులు చేయడానికి ముందు దక్షిణ లెబనాన్‌లోని 50 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా అక్కడి ప్రజలకు సూచించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు.

# కాకినాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

### నిల్వ చేసిన చికెన్, మాంసం గుర్తింపు

కాకినాడ,మార్చి2(ఆర్ఎన్ఎ):కాకినాడలో సీజన్ 5 రెస్టారెంట్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు సహా రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, సివిల్ సప్లైస్ విభాగాల అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. రెస్టారెంట్‌లో వినియోగదారులకు నిల్వ చేసిన మాంసం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో కిలోలకొద్దీ చికెన్, ఫ్రై శాంపిల్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. నిల్వ మాంసం కావడంతో అన్నింటినీ సీజ్ చేసినట్లు తెలిపారు. నిల్వ మాంసాన్ని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెస్టారెంట్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కూడా అధికారులు తప్పుబట్టారు. ఈ చర్యలతో రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రత్తిపాడులో జంతుకొవ్వుతో నూనె తయారు చేస్తూ ఓ ముఠా పట్టుబడిన ఘటన మరువకముందే కాకినాడ రెస్టారెంట్ నిర్వాహకుల మోసం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కాకినాడలోని అనేక హోటల్స్‌లో తరచూ ఆహార కల్తీ జరుగుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారు.

# స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

### తీవ్రంగా నష్టపోయిన సూచీలు

ముంబయి,మార్చి1 : ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి. సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్–అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

## నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

యాదగిరిగుట్ట,మార్చి2 : ఈ నెల 3న సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చందగ్రహణం కారణంగా ప్రధానాలయంతో పాటు ఉపాలయాలు, అనుబంధ దేవాలయాలలో ఉదయం 7 గంటలలోపు సుప్రభాత, నిజాభిషేకం, అర్చనలు ముగించి మూసివేస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రధానాలయంతో పాటు ఉపాలయాలను తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, ఆరగింపు, నిజాభిషేకం నిర్వహించి, ఉదయం 8.45 గంటలకు ఉభయ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు. చందగ్రహణం సందర్భంగా స్వామివారి సన్నిధిలో రేపు జరిగే హోలికోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహిస్తామని ప్రకటించారు.

# రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం





- అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
- డిసిసి అధ్యక్షులు శిక్షణ శివిరం ముగింపులో సిఎం రేవంత్

**వికారాబాద్,మార్చి2** :లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్తాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# వీడియో తీయకుండా ఓపెన్ చేస్తే శాల్తీ గల్లంతే



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మార్చి 2 చట్టం ప్రతినిధి** : ఏ వస్తువునైనా ఆన్లైన్లో బుక్ చేసుకుని డెలివరీ తీసుకునే ముందు వీడియో తీయకపోతే వినియోగదారులు నష్టపోతారని మరోసారి రుజువయింది ఆగిరిపల్లి గ్రామంలో ఒక వినియోగదారుడు 7600 రూపాయల విలువ గల వెల్డింగ్ మిషన్ అమెజాన్ లో బుక్ చేయగా వినియోగదారానికి అదే బరువు గల సాల్ట్ ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. వినియోగదారుడు ముందు జాగ్రత్తతో వీడియో తీస్తూ పార్సిల్ ఓపెన్ చేయడంతో వచ్చినది వెల్డింగ్ మిషన్ కాదని సాల్ట్ ప్యాకెట్లను తేటతెల్లమయింది .కాగా వినియోగదారుడు ఈ వీడియోని అమెజాన్ వారికి ఫిర్యాదు చేస్తూ అప్లోడ్ చేయగా అమెజాన్ కంపెనీ వారు స్పందించి త్వరలో వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చారు . వీడియో తీయకుండా ఉంటే కచ్చితంగా నష్టపోవాల్సి వచ్చేదని వినియోగదారుడు వాపోయాడు. బాగా ఈ మార్పిడి అమెజాన్ కంపెనీలో జరిగిందో మధ్యలో డెలివరీ బాయ్స్ మోసం చేశారో అర్థం కాలేదు

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హిందువులంతా ఐక్యంగా పోరాడాలి
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కామారెడ్డి,మార్చి2** : హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తె అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కా ర్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాహుల్ను ఉద్దేశిం చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# ఇరాన్ ప్రతీకార దాడులు ముమ్మరం

## సౌదీలో అతిపెద్ద చమురుశుద్ధి కేంద్రంపై దాడి




టెహ్రాన్,మార్చి2 :అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇప్పటికే అనేక భవనాలు, కీలక స్థావరాలు నేలమట్టం అయ్యాయి. అయితే తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీపై షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్నాయి. ఈ దాడి ప్రభావం చమురు ధరలపై ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. సోమవారం ఇరాన్ అరామ్ కో రిఫైననరీపై దాడి చేసింది. ఈ దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నేపథ్యంలో ర్గి÷నైరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ప్రతీకార దాడులకు దిగిన తరువాత చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ యుద్ధం కారణంగా వివిధ దేశాలకు ఇంధన కొరత ఏర్పడనుంది. ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు మండుతున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లు దాటింది. ఇప్పుడు తాజా దాడులతో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంధన ధరలు పెరుగుదల అనేది సామాన్యులు వినియోగించే కిరాణా సామాగ్రి, ఇతర వస్తువుల ధరలపై ప్రభావం చూపనుంది. చాలా మంది వినియోగదారులు ఇప్పటికే పెరిగిన ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్నారు. మరోవైపు, పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ దాడి జరగ్గా.. దుబాయ్, దోహా, అబుదాబి, జెరూసలెంలోనూ సోమవారం పేలుడు శబ్దాలు వినిపించాయి.

## శెట్టి వారి వివాహ మహోత్సవానికి హాజరైన మన అరకు పార్లమెంట్ సభ్యురాలు.(ఎంపీ)

**డా॥ తనూజ వినయ్**





**విశాఖపట్నం:** (VMRDA) కన్వెన్షన్ హాల్ (వేపగుంట) లో జరిగిన శెట్టి వారి వివాహ మహోత్సవ రిసెప్షన్ కార్యక్రమానికి విచ్చేసి నవవదూరులు..బి సౌ గీతాంజలి. వెడ్స్ చిరామ్ కుమార్.. లకు అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళ్లు పిల్లా పాపలతో వెల్లివిరియాలని ఆకాంక్షించిన మన అరుకు పార్లమెంట్ సభ్యురాలు (ఎంపీ)
డా..తనూజ వినయ్... ఈ కార్యక్రమంలో అరుకు మాజీ శాసనసభ్యులు ఒవైసిపి పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు.. చెట్టి ఫాల్గుణ.. మరియు అనేకమంది ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూసివేత



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మార్చి 2 చట్టం ప్రతినిధి :** శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల దేవస్థానం ది.03.03.2026 వ తేదీ మంగళవారం సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయంలో నిత్యసేవల అనంతరం ఉదయం గం.10 లకు మూసివేసి మరలా ది.04.03.2026 వ తేదీ బుధవారం సంప్రోక్షణ అంతరం దర్శనములు ఉండును.భక్తులు సహకరించగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి సి హెచ్ సాయిబాబు తెలిపారు

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం



**అందోల్ మండల్ ప్రతినిధి. మార్చ్ 2 (చట్టం)న్యూస్ :** వట్పల్లి మండల పరిధిలోని మరవెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించి అలరించారు. ప్రధానోపాధ్యాయులుగా భార్గవి, డీఈవోగా ఆర్మాన్, ఎంఈఓ గా జ్యోతిక, కలెక్టర్గా అక్షిత, విద్యాశాఖ మంత్రిగా కౌశిక్, ఉపాధ్యాయులుగా మనీషా, రేణుక, వర్ష, సంకీర్తన, శ్రీ రామ్, విశ్వతేజ, లక్షిత్, నితిన్, మనోహర్, మల్లేష్ వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు రితిన్ రెడ్డి, సంగయ్య మరియు రవీందర్ పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో హోలీ వేడుకలు జరుపు కోవాలి

**మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 2, (చట్టం బ్యూరో)** ; ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రతి ఒక్కరు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని మర్లపేట గ్రామ,బోయిన్ పల్లి మండల ప్రజలకు హోలీ వేడుకలు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హోలీ గొప్ప మహోత్సవం అని ఈ వేడుకలను అందరూ పాల్గొని సుఖ సంతోషాలతో గడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## బమ్మెర పోతన - భక్తి కవిత్వం!



ఆతని పద్యాలు భక్తి రస పూరితాలు
అవి పుణ్య గంగానదీ ప్రవాహాలు
ఆయన భావాలు విరబూసిన తామరలు
అవి భక్తుల హృదయ రంజితాలు

తెలుగు తల్లి గర్భాన వెలిసిన
తీయని కవితారస వాగ్గేయకారుడు
తేటతెలుగు పదాలతో కవితలల్లిన
తెలుగు భాగవత రచనాకారుడు

రాజసభల రంజకతను తిరస్కరించి
రామనామ మాధుర్యాన్ని కోరుకున్నవాడు
రమణీయ కవితాగానంతో అలరించి
రాముని దయానుగ్రహాన్ని పొందినవాడు

అక్షరాలను పరిమళ పుష్పాలుగా చేసి
ఆ కృష్ణుని పాదాలకు సమర్పించినవాడు
ఆయన భాగవత శ్లోకాలననువదించి
ఆ దేవదేవునికి అక్షరార్చన గావించినవాడు

పాలికెడిది భాగవతమట - అంటూ
పలికించినవాడు రామభద్రుండన్నవాడు
పరమాత్ముని దర్శనాన్ని - కంటూ
పరవశంతో భాగవతాన్ని రచించినవాడు

అతని కలం నుంచి జారిన ప్రతి అక్షరం
అమోఘ భక్తికి వేసిన దివ్య విత్తనం
అది హృదయానుభూతి, హరిభక్తి హారం
అవి మనసుని మలచే మంత్రాంజనం

పల్లె పొలాల్లో, పసిడిపంటలలో
పవిత్రగీతంలా వినిపించే భాగవత జపం
ప్రతీ తెలుగు వారి హృదయాలయంలో
పరమపావనంగా వెలిగే ఆధ్యాత్మిక దీపం!

E.V.V.S. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ

చట్టం సాహితీ లోకం 95814 19999

## అంతరంగాల ఆంతర్యం అంతుచిక్కని ప్రశ్నల సంద్రం




తరాల అంతరాలు పెరుగుతున్నాయి.
అంతు చిక్కని అంతరంగాల ఆంతర్యం కాలానికే ప్రశ్నలను సంధించి అదృశ్యమై పోతుంటే, శాశ్వతమని భ్రమించే బుద్ధి జీవుల బుద్ధి హీనత్వం బురదలో దిగబడి,
జీవిత సత్యాలను సమాధిలో పాతి పెడుతున్నది. నీది కాని రేపటి కోసం నేడన్నది వదిలేసి,
వంచనతో జీవించే వింత ప్రపంచాన్ని నిర్మించుకుని, కల్పితాల మధ్య, కడు ఆనందంతో కాలాన్ని గడిపేస్తుంటే,
నిజమన్నది కంటగింపుగా మారి, అబద్ధమన్నది పరవళ్ళు తొక్కిపరమానంద భరితులను చేసే సన్నివేశాల సమాహారంలో
దర్పంగా జీవించే కాల్పనిక జగత్తుకు ద్వారాలు తెరుస్తూ, నిజాన్ని చూడలేని మానసిక అంధత్వంలో మగ్గుతున్న అహం పొరలు కమ్మిన అజ్ఞానంలో ఓలలాడుతున్న మానవ జీవ సమూహానికి బ్రతుకన్నది ఒక విలాసం.
చావన్నది ఒక విషాదం.
కాల జలధిలో కలసిపోయే బ్రతుకులు రేపటి తరానికి మిగిల్చిన అనుభవాల గురుతులు.
జీవితం ఒక అనంత సాగర మథనం.
జీవమున్నంత వరకు నిరంతరం చేసే సమరం.
జీవితమంటే అనుభవ సందేశ సారాంశాల సమాహారం.
కన్నీళ్లకు కాలం కరగదు.
కాలం సంధించే అస్త్రాలను చేధించి,జీవించడమే మానవ ధర్మం.
రాలిపోయే పండుటాకులు చిగురుటాకులకు స్వాగతమిచ్చి, నిష్క్రమించే యథార్థ జీవిత కథలకు ప్రతిరూపాలు.
కాలం పరుగెడుతూనే ఉంటుంది.
చీకటి వెంటాడుతూనే ఉంటుంది.
వెలుతురు చీకటిని తరుముతూనే ఉంటుంది.
సూర్యోదయంతో విచ్చుకొన్న వెలుగు రేఖలు సూర్యాస్తమయంలో పడమటి తీరానికి వాలి,విశ్రమించి మరో ఉదయం కోసం నిరీక్షిస్తుంటాయి.

-సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు,
మోటివేషనల్ స్పీకర్)

చట్టం సాహితీ లోకం 95814 19999

## రంగుల పండుగ --- హోళి



రంగుల పండుగ హోళి ---
హృదయాలపై వెలుగులు చల్లి,
వర్ణాల వర్షంలో తడిసి
చలికే చెప్పే వీడ్కోలు.

ఎరుపు ప్రేమకు ప్రతీక,
పసుపు పుణ్యపు చిరునవ్వు,
ఆకుపచ్చ ఆశల పిలుపు,
నీలి నమ్మకపు కలువవ్వు.

చేతిలో గులాల్ పట్టుకుని
మనసులు కలిపే వేళ,
నిన్నటి నొప్పులు కడిగేసి
నవ్వులు చిందించే వేళ.

బంధాల మధ్య గోడలు కూల్చి
స్నేహం రంగులై పరచి,
కలహాలపై క్షమ కురిపించి
కరుణ కాంతులు మెరిపించు.

హోళి అంటే హంగామా కాదు,
హోళి అంటే హృదయోత్సవం,
మనుషుల మధ్య ప్రేమ చల్లే
సజీవ సౌహార్ద పర్వం.

రంగులు మన ముఖాలకే కాదు ---
మనసులకూ అంటుకోవాలి,
ప్రతి రోజూ హోళిలా మారి
ప్రపంచం ప్రేమమయం కావాలి.

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## తార్కాణం



దాహం దాహం అంటూ
మనిషి అవసరానికి అడిగితే
బిందెడు నీళ్లు ఇవ్వలేని మనిషి
తోటి మనిషిపై కారణం లేకుండానే
బోలెడు నిందలు వేయగలడు
ఇలా చేయడం అనేది మాత్రం
మనిషి యొక్క గుణానికి
నీచమైన బుద్ధికి తార్కాణం కాదా?

ప్రస్తుత యాంత్రిక జీవనంలో
డబ్బు చాలా అమూల్యమైనది
కానీ... ధనం కన్నా మనిషికి
ఎంతో విలువైనది మనశాంతి
అయినా మనశాంతిని ఎవ్వరూ
నీకు అప్పుగా ఇవ్వలేరులే
నీకై నువ్వు సంపాదించుకోవాలి.

ఆస్థి కావాలంటే ఇవ్వొచ్చు
అంతస్థులు కావాలన్నా తీసుకోవచ్చు
మనశాంతి అనేది మాత్రం
ఒకరు ఇచ్చేది కాదు
నీకై నువ్వు అనుభవించేది.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

చట్టం సాహితీ లోకం 95814 19999

## యుద్ధం



యుద్ధం అనాగరికం
యుద్ధం అమానవీయం
యుద్ధం అశాంతి
యుద్ధం అమానవీయం
యుద్ధం అరాచకం
యుద్ధం ఆరంభం
యుద్ధం ఆందోళనకరం
యుద్ధం ఆవేదన భరితం
యుద్ధం ఇక్కట్లమయం
యుద్ధం భయానకం
యుద్ధం భీభత్సం
యుద్ధం రక్తసిక్తం
యుద్ధం లో క్షిపణులు,డ్రోన్లతో దాడులు
దౌర్జన్యాలతో
మారణకాండ
అన్నెం పున్నెం ఎరుగని అమాయక
విద్యార్థుల మరణం
సైనికుల అమాయక ప్రజల ప్రాణాలకు
రక్షణ కరువు
బతకడం బరువు
అమెరికా ఇజ్రాయెల్ ల పరువు
ఇరాన్ కకావికలం
వ్యక్తి మీద ఈర్ష్య ద్వేషం
వ్యవస్థపై పగ ప్రతికారం
మరణవార్త విని రాక్షసానందం
మానవత్వం చిరునామా లేని ఉత్తరం
విమానాశ్రయాల్లో చిక్కుకున్న జనం
ప్రపంచ వ్యాప్తంగా భయం భయం
ఏ క్షణాన ఏమౌతుందో తెలియని
అయోమయం
యుద్ధం అంతం
ప్రపంచ దేశాల పంతం
యుద్ధం వద్దు
శాంతే ముద్దు

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
సైదాబాద్, హైదరాబాద్.

చట్టం సాహితీ లోకం 95814 19999


## హోలీ




నల్ల మొబ్బుల్లో తెల్లని చంద్రుడు వెలిగి నట్లు
పచ్చని ప్రకృతి లో
కాషాయం పూలు పూసి నట్లు
గులాబీలు రంగు రంగు లుగా విరబూసినట్లు
ఇంటి ముందు ముగ్గులు రంగులుగా వేసి నట్లు
నీలి రంగు తో ఆకాశం నిండి నట్లు
పసుపు కుంకుమలు పులకరించినట్లు
మండే సూర్యుడు ఎర్రగా భగ్గు మన్నట్లు
హరి విల్లు ఏడు రంగులతో
అద్ది నట్లు
రంగు రంగులు జీవితం లో
భాగం అయినప్పుడు
రంగులతో లోకం రంగరించి నట్లు
రంగుల హోలీ రంగేలి
అందరి కలలు రంగులతో
పండించాలి ...

డి చాంద్ బాషా రచయిత





చట్టం సాహితీ లోకం 95814 19999

## నారి జ్ఞాన గుణ శిఖరిణి!

సృష్టికి మూలం ప్రాణప్రదాత ఈ శ్రీ మూర్తి కదా శక్తిస్వరూపిణి,
అన్యాయాన్ని ఎదిరించి నిలిచేటి ప్రత్యక్ష దైవమైన ధర్మరక్షిణి!
కష్టాల కడలిని చిరునవ్వుతో దాటించే అమృత మధుర హాసిని,
మమకారపు వెన్నెల కురిపించే ఇంటి వెలుగుల నందన మాలిని!

ఓర్పుకు మారుపేరుగా నిలిచి భారాన్ని మోసే తల్లి మన ఈ అవని,
సహనంతో సర్వం భరిస్తూనే విత్తనాన్ని వృక్షం చేసే ప్రాణవాహిని!
ప్రకృతి ఒడిలో పచ్చని చెట్టులా నీడను పంచే గొప్ప మహిళామణి,
తరతరాల సంస్కృతిని కాపాడే అక్షర రూపపు జ్ఞాన గుణ శిఖరిణి!

స్వార్థం లేని స్నేహానికి మలినం లేని మనస్సుకు ఈమె చిరునామా,
కల్మషం లేని పవిత్ర ప్రేమకు కదిలి వచ్చిన ప్రతిమ గాని ఒక దేవత!
ప్రకృతి సౌందర్యాల ప్రతిరూపమై పరిమళాలు వెదజల్లే సౌరభ లత
అమ్మగా ఆత్మీయతను పంచి అలసటను తీర్చే ఒక అద్భుత మాత!

కంటిపాపలా కాపాడే మాతృత్వానికి అంకితమైన త్యాగ మూర్తి,
చీకటిని చీల్చుకు వచ్చే సూర్యకాంతిలా నలుదిశలా వ్యాపించే కీర్తి!
అయస్కాంత శక్తిలా అనురాగంతో లోకాన్ని కలిపే అనుబంధ దీప్తి
స్త్రీమూర్తి లేని ఈ సృష్టి గమనము వెలుగు లేని ఒక శూన్య నిశీథి.

శ్రీమన్నారాయణ కలం వినిపించే ఈ మాతృ నినాదం జగతికి అంకితం,
ప్రకృతి ధర్మం వీడకుండా సాగడమే మానవ మనుగడకు ప్రాణాధారం!
స్త్రీని గౌరవించే ప్రతి ఇల్లు సుఖ శాంతులకు శుభప్రదమైన పవిత్ర నిలయం,
నారీ శక్తిని చాటే ఈ కవిత లోకానికి ఒక దివ్య ప్రారంభానికి శుభోదయం!

రచన: బిటవరం శ్రీమన్నారాయణ, ఎలుకుర్తి హవేలి - వరంగల్.

చట్టం సాహితీ లోకం 95814 19999

## శ్రావణ భాద్రపద మాసాలు (గేయం)



పల్లవి:
వచ్చాయమ్మా శ్రావణ భాద్రపదాలు,
తెచ్చాయమ్మా వర్షాల హర్షాలు!

చరణం 1:

పండుగలకు కొదువ లేదు,
పరితాపాలకు తావు లేదు,
శ్రావణ భాద్రపదాల్లో ప్రమోదము,
శ్రామికుల గుండెల్లో వినోదము!

చరణం 2:

శ్రావణ మగునుగ పావన శ్రామము,
శ్రమణులకు నచ్చిన గొప్ప మాసము,
చేసెదరుగా మంగళగౌరీ నోము,
సిరుల నిచ్చునుగా వరలక్ష్మీ వ్రతము!

చరణం 3:

భక్తులు మెచ్చెడి భాద్రపదము,
ముక్తిని ప్రసాదించు వాజము,
చేసెదరుగ భక్తితో విఘ్నరాజు అర్చనము,
సకల వెతలను తొలగించు సంయమనము!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి,
చెన్నై

చట్టం సాహితీ లోకం 95814 19999

## నా ప్రయాణం

చుక్ చుక్ అంటూ రైలు కదలడానికి ముందు ఉన్న ఆ పదిహేను నిమిషాలు కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతే.

ప్లాట్‌ఫామ్ మీద జీవితం పరుగులు తీస్తోంది. “చాయ్ చాయ్...” అంటూ వేడి వేడి టీతో కప్పులు పట్టుకుని పరుగులు తీసే వాళ్లు, “వాటర్ వాటర్...” అంటూ దాహార్తిని తీర్చే నీటి సీసాలు అందించే వారు, “గరం గరం సమోసా...” అంటూ ఆకలి మంటలను ఆర్పే స్నాక్స్ అమ్మేవారువాళ్లందరిలోనూ సేవా భావం కనిపించింది. వారి కళ్లలో అలసట ఉన్నా, చేతుల్లో పని ఉన్నా, హృదయంలో మాత్రం మనుషుల పట్ల ఓ మృదుత్వం మెరిసింది.

“ఈ లోకంలో ఇంకా మంచితనం బ్రతికే ఉంది” అన్న నమ్మకం అక్కడే మొదలైంది.నేను కూర్చున్న కేబిన్ ప్రశాంతంగా ఉంది. ఇక్కడక్కడ ఇద్దరు ముగ్గురు మాత్రమే. ఆ నిశ్శబ్దంలో నా ఊపిరి కూడా వినిపించేంత ప్రశాంతత. హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుని కిటికీ పక్కన హాయిగా కూర్చున్నాను.

అంతలో ఒక్కసారిగా రైలు కుదిపింది. చకచకా చకచకా అంటూ చక్రాలు గమనం మొదలుపెట్టాయి. ప్రయాణం ప్రారంభమైంది. హృదయం కూడా రైలు లాగే ముందుకు కదిలింది.ప్లాట్‌ఫామ్ వెనుకబడింది. నగరం కూడా మెల్లగా జ్ఞాపకంగా మారింది.

కాంక్రీట్ భవనాల స్థానంలో పచ్చని పొలాలు ప్రత్యక్షమయ్యాయి. పొలిమేరలు దాటి రైలు అడవిలోకి అడుగుపెట్టింది. చుట్టూ పచ్చని చెట్లు, వనాలు, వాగులు, వంతెనలు, నదులు, లోయలు, కొండలు---ప్రకృతి తన సొంత గీతాన్ని ఆలపిస్తోంది.

మధ్య మధ్యలో రైలు కూతలు కూస్తూ తన ఉనికిని తెలియజేస్తోంది. ఆ కూతల్లో ఒక పిలుపు ఉంది “జీవితం ముందుకు సాగాలి” అనే పిలుపు.

సాయంత్రపు రంగులు క్రమంగా రాత్రి చీర కప్పుకున్నాయి. కిటికీ ద్వారా చల్లని గాలి వీస్తోంది. ఆకాశంలో నక్షత్రాలు తళతళ మెరుస్తున్నాయి. దూరంగా పక్షుల గూళ్లు, జంతువుల కదలికలు క్షణకాలం కనిపించి మాయమవుతున్నాయి.
మిణుగురు పురుగులు వెలుగులతో నాట్యం చేస్తూ కిటికీకి దగ్గరయ్యాయి.

ఒక్కసారిగా సన్నని చినుకులు పడటం మొదలైంది. ఆ వర్షపు వాసన మనసును మత్తెక్కించింది. ఆ తర్వాత చల్లని వెన్నెల పరచుకుంది.ఓహ్! ఎంత ఆనందం! ఎంత ఆహ్లాదం! ప్రకృతి తన ఒడిలో నన్ను నిద్రపుచ్చినట్టు అనిపించింది.

అప్పుడే ఒక ఆలోచన మెదిలిందిరైలు ఎప్పుడూ ఆగకపోతే ఎంత బాగుంటుంది?జీవిత ప్రయాణం కూడా ఇలాగే నిరంతరంగా సాగితే ఎంత మంచిది?కానీ వెంటనే తెలిసింది---రైలు గమ్యం కోసం ఆగాలి.మనిషి జీవితం కూడా అర్థం కోసం ఆగాలి.

ఈ ప్రయాణం నాకు ఒక పాఠం నేర్పింది.రైలు వెనుకబడిన దృశ్యాలను చూసి బాధపడదు. అది ముందుకు మాత్రమే చూస్తుంది.
మనమూ అలాగే గతాన్ని వదిలి ముందుకు సాగాలి.

అహంకారం ఎందుకు?స్వార్థం ఎందుకు?అసూయ, ఈర్ష్య, ద్వేషాలు ఎందుకు?ప్రకృతిలో ఎక్కడా ఇవి కనిపించవు.నది ప్రవహిస్తుంది---అది ఎవరికీ అడ్డం పడదు.గాలి వీస్తుందిఎవరినీ అడగదు.
చంద్రుడువెలుగునిస్తుంది
ఎవరికీ తేడా చూపదు.
జీవితం కూడా అలా ఉండాలి.ఆనందం పంచాలి.
ప్రేమ పంచాలి.మనసు విప్పాలి.ఈ రైలు ప్రయాణం నాకు తెలియజేసిందిగమ్యం కన్నా ప్రయాణమే ముఖ్యమని.

సొంతం చేసుకోవడం కన్నా అనుభవించడం మధురమని.ద్వేషం కన్నా దయ గొప్పదని.జీవిత రైలు సాగుతూనే ఉంటుంది. మనముప్రయాణికులమే.మనం తీసుకెళ్లేది సంపద కాదుస్మృతులే.అందుకే...
ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ,
ప్రతి మనిషిని గౌరవిస్తూ,
ప్రతి అనుభవాన్ని ప్రేమిస్తూ జీవించాలి.అప్పుడు జీవితం ఒక సాధారణ ప్రయాణం కాదు---ఒక సార్థక యాత్ర అవుతుంది.

మిత్రాజి
(గుండవరం ప్రభాకర్ రావు పంతులు )
అత్వెల్లి, మేడ్చల్ జిల్లా



# ఉస్తాద్ నుంచి పవన్ మరో లుక్




పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్నది. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన దేఖ్ లేంగే సాలా, సాంగ్స్ నెట్టింట వైరల్ అవుతున్నారు. మేకర్స్ ఏదో ఒక ప్రమోషనల్ మెటీరియల్ రిలీజ్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన లుక్‌లో ఉస్తాద్ భగత్ సింగ్‌గా పవన్ కల్యాణ్ తన దైన స్టైల్‌లో చైర్‌పై కూర్చొని ఛిల్ అవుట్ మూడ్‌లో ఉండటం చూడొచ్చు. ఈ స్టిల్ చూస్తుంటే అభిమానులు ఆశించే ఎంటర్‌టైన్‌మెంట్ ఉస్తాద్ భగత్ సింగ్‌లో పుష్కలంగా ఉండబోతున్నట్టు హరీష్ శంకర్ హింట్ ఇచ్చేస్తున్నాడు. తాజా లుక్ అభిమానులు, మూవీ లవర్స్‌లో మరింత హైప్ పెంచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు

## తులసిపూజ.. సత్యనారాయణ స్వామి వ్రతం

వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో



చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక



నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.

# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.




# ఉగాదికి విశ్వంభర స్పెషల్ గ్లింప్స్





మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు వశిష్ట ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తుండగా,యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలు చోటా కే నాయుడు నిర్వహిస్తున్నారు. విజువల్‌గా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతోంది. షూటింగ్ పూర్తయినప్పటికీ 'విశ్వంభర' విడుదల కొంతకాలంగా వాయిదా పడుతోంది. ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని తెలుస్తోంది. అత్యున్నత స్థాయి సీజీ వర్క్ అవసరం కావడంతో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ సమయం తీసుకుంటున్నారు. టీజర్‌లోని కొన్ని గ్రాఫిక్స్‌పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలను సీరియస్‌గా తీసుకుని రీ-వర్క్ కూడా చేపట్టినట్లు సమాచారం. ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్‌కే దాదాపు రూ.75 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారనే వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఉగాది సందర్భంగా 'విశ్వంభర' స్పెషల్ గ్లింప్స్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే గ్లింప్స్‌తో పాటు అధికారిక రిలీజ్ డేట్ ప్రకటించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీజర్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రం, కొత్త గ్లింప్స్‌తో అంచనాలను మరింత పెంచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విషయానికి వస్తే, 'విశ్వంభర' 14 లోకాల కాన్సెప్ట్ చుట్టూ తిరిగే ఫాంటసీ అడ్వెంచర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణికంగా చెప్పబడే ఊర్ధ్వ లోకాలు, అధో లోకాల నేపథ్యంతో కథ సాగుతుందని, వీటికి మించి ఉన్న 'విశ్వంభర' అనే ప్రత్యేక లోకాన్ని చేరుకోవడానికి హీరో చేసే సాహస యాత్ర ప్రధాన కథాంశమని ప్రచారం. ఈ స్టోరీ లైన్ మెగా అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ థియేట్రికల్ ట్రైలర్ ఇప్పటికే సిద్ధంగా ఉందని తెలిపారు. టీజర్‌లో చూసిన విజువల్స్‌తో పోలిస్తే ట్రైలర్ పూర్తిగా భిన్నంగా, మైండ్ బ్లోయింగ్ అనుభూతిని ఇస్తుందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. టీజర్‌పై వచ్చిన విమర్శలకు ట్రైలర్‌తో గట్టి సమాధానం ఇవ్వాలన్నదే యూనిట్ లక్ష్యమని తెలుస్తోంది.

## చట్టం చిత్రం

# టాక్సిస్‌లో తబాహి సాంగ్ విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం యష్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందనే విశ్వాసం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచేసింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'తబాహి'ను మేకర్స్ విడుదల చేశారు. అయితే కేవలం ఆడియో రూపంలో మాత్రమే సాంగ్ విడుదల కావడంతో ఫ్యాన్స్ కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. విజువల్ ప్రెజెంటేషన్ కోసం ఎదురు చూసిన అభిమానులకు లిరికల్ లేదా వీడియో సాంగ్ రాకపోవడం చిన్న నిరుత్సాహమే అయినప్పటికీ, పాట మాత్రం మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ సాంగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో అన్ని ప్రధాన భాషల్లో విడుదల చేశారు. తెలుగులో ఈ పాటకు ప్రముఖ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా స్వరపరచి స్వయంగా ఆలపించారు. మ్యూజిక్‌లో యాక్షన్ మూడ్, ఎమోషనల్ అండర్‌టోన్ కలగలిపిన శైలి కనిపిస్తోందని సంగీత ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. 'టాక్సిక్'లో యష్‌కు జోడీగా కియారా అద్వాని నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'తబాహి' సాంగ్‌తో 'టాక్సిక్' మ్యూజికల్ జర్నీ





ప్రారంభమైంది. త్వరలో విజువల్ సాంగ్ విడుదలైతే అంచనాలు మరింత పెరగడం ఖాయం.

# పెద్ది రెండో సింగిల్ విడుదలకు సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' రెండో సింగిల్ 'రాయ్ రాయ్ రా రా' విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. తొలి పాట 'చికిరి చికిరి'కి మంచి స్పందన లభించిన నేపథ్యంలో రెండో సాంగ్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి ఎలాంటి ప్రోమో విడుదల చేయకపోవడంతో పాట రిలీజ్ టైమ్‌పై కొంత గందరగోళం నెలకొంది. తాజా అప్‌డేట్ ప్రకారం 'రాయ్ రాయ్ రా రా' పాటను మంగళవారం సాయంత్రం 7:02 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ టైమ్‌ను కన్ఫర్మ్ చేస్తూ చరణ్‌కి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో చరణ్ మాస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తున్నారు.

ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ పాట మోటివేషనల్ టచ్‌తో కూడిన మాస్ నంబర్‌గా ఉండనుంది. ముఖ్యంగా చరణ్ డాన్స్ మూవ్స్ ఈ సాంగ్‌కు హైలైట్ అవుతాయని టాక్. తన ఎనర్జీ, గ్రేస్‌తో చరణ్ మరోసారి అభిమానులను అలరించనున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.






# సంజూ శాంసన్.. కోహ్లీ, రోహిత్ రికార్డ్ బద్దలు!

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఛేజింగ్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన ఆటగాడిగా కూడా సంజూ శాంసన్ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రికార్డులను సంజూ శాంసన్ అధిగమించాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్‌తో కోల్‌కతా వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్)అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్ ఛేజింగ్‌లో టాప్ స్కోర్ కోహ్లీ పేరిట ఉండేది. అతను టీ20 ప్రపంచకప్ 2022లో పాకిస్థాన్‌పై, 2016 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఛేజింగ్‌లో 82 పరుగులు చేశాడు.సంజూ శాంసన్ తరహాలోనే ఈ రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ భారత్‌కు విజయాన్నందించాడు. తాజా మ్యాచ్‌లో సంజూ 97 పరుగులతో అజేయంగా నిలిచి కోహ్లీని వెనక్కినెట్టాడు. ఈ మ్యాచ్‌లో 16 బౌండరీలతో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన రోహిత్ శర్మ(15)ను రికార్డును అధిగమించాడు.రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 15 బౌండరీలు బాదగా.. సంజూ శాంసన్ తాజా ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 16 బౌండరీలు బాది హిట్ మ్యాన్‌ను అధిగమించాడు. సురేశ్ రైనా తర్వాత టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ కలిగిన రెండో భారత బ్యాటర్‌గా సంజూ శాంసన్ నిలిచాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో సురేష్ రైనా(60 బంతుల్లో 101) సౌతాఫ్రికాపై సెంచరీతో చెలరేగాడు. పొట్టి ప్రపంచకప్‌లో భారత్ తరఫున సెంచరీ బాదిన ఏకైక బ్యాటర్ కూడా సురేష్ రైనానే కావడం గమనార్హం.గురువారం వాంఖడే వేదికగా జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. సంజూ శాంసన్ సూపర్ ఫామ్ నేపథ్యంలో అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు అనడానికి సంజూ శాంసన్ కెరీరే ఉదాహరణ. ఈ మెగా టోర్నీకి ముందు సంజూ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడ్డాడు.



ఐదు మ్యాచ్‌లకు ఐదింటిలో విఫలమయ్యాడు. చివరకు తుది జట్టులో చోటు కోల్పోయాడు. కానీ అనూహ్యంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసలు సిసలు మ్యాచ్‌లో సత్తా చాటాడు. జీవితానికి సరిపోయే ఇన్నింగ్స్ ఆడాడు.

............

# భారత్‌ను ఢీకొట్టనున్న ఇంగ్లాండ్

- మొదటి గ్రూప్ నుండి భారత్, దక్షిణాఫ్రికా
- రెండో గ్రూప్ నుండి ఇంగ్లాండ్, న్యూజిలాండ్
- సెమీఫైనల్స్ చేరిన నాలుగు జట్లు



టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ చేరిన నాలుగు జట్లు ఖరారయ్యాయి. ఆదివారం రాత్రి కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై భారత జట్టు 5 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఓపెనర్ సంజూ శాంసన్ 97 పరుగుల అజేయ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడి, ఇండియాను సెమీఫైనల్‌కు చేర్చారు. సెమీఫైనల్‌లో చోటు దక్కించుకున్న నాలుగో జట్టు భారత్. భారత్‌తో పాటు ఫైనల్-4 బెర్త్ దక్కించుకున్న మిగిలిన మూడు జట్లు ఏవి, సెమీఫైనల్ మ్యాచ్‌లు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో వివరాలు ఇక్కడ తెలుసుకోండి.భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు సెమీఫైనల్స్ చేరాయి. భారత్ కంటే ముందే దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ సెమీఫైనల్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. సూపర్-8లోని మొదటి గ్రూప్ నుండి భారత్, దక్షిణాఫ్రికా జట్టు సెమీస్ చేరగా, రెండో గ్రూప్ నుండి ఇంగ్లాండ్, న్యూజిలాండ్ తుది-4లో చోటు దక్కించుకున్నాయి. ఆసియా నుంచి చాలా దేశాలు టోర్నీ ఆడినా కేవలం భారత్ మాత్రమే సెమీఫైనల్స్ చేరుకోవడం విశేషం. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ తమ తమ గ్రూపుల్లో అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్ చేరుకున్నాయి. మార్చి 1న రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచులో ఇండియా ప్రత్యర్థి వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్ 4లో చోటు దక్కించుకుంది. ఇక సూపర్-8 మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకను 65 పరుగులు లేదా అంతకంటే ఎక్కువ తేడాతో ఓడించలేకపోవడంతో న్యూజిలాండ్ సెమీఫైనల్స్ చేరిందని తెలిసిందే. 2026 టీ20 వరల్డ్ కప్ మొదటి సెమీఫైనల్ మ్యాచ్ మార్చి 4న దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది. ఇందులో విజేత తొలి ఫైనలిస్ట్ అవుతుంది. రెండో సెమీఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుంది. రెండో ఫైనలిస్ట్ డిసైడ్ చేసే మ్యాచ్ ఇది.

# అభిషేక్ త్వరగా అవుటవ్వడమే మంచిదైంది..

## టీమిండియా మాజీ కోచ్ అభిషేక్ నాయర్

టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లినప్పటికీ, జట్టులోని కొందరు యువ ఆటగాళ్ల ఫామ్ ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ముఖ్యంగా ఐపీఎల్‌లో సిక్సర్ల వర్షం కురిపించి, భారీ అంచనాలతో బరిలోకి దిగిన అభిషేక్ శర్మకు ఈ మెగా టోర్నీ ఒక పీడకలలా మారింది. జింబాబ్వేపై మెరుపు హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నప్పటికీ, ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో వరుసగా విఫలమవుతూ వస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన సూపర్ 8 పోరులో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. బ్యాటింగ్‌లోనే కాదు, ఫీల్డింగ్‌లో కూడా అభిషేక్ రెండు ఈజీ క్యాచ్‌లను చేజార్చి జట్టును ఇబ్బందుల్లోకి నెట్టాడు. అయితే అతడి వైఫల్యంపై టీమిండియా మాజీ కోచ్ అభిషేక్ నాయర్ చేసిన విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిషేక్ శర్మ త్వరగా అవుట్ అవ్వడం టీమిండియాకే మేలు చేసిందని నాయర్ అనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఏ కోచ్ అయినా తన ఆటగాడు అవుట్ అయితే బాధపడతాడు, కానీ నాయర్ మాత్రం అభిషేక్ శర్మ అవుట్ అవ్వడాన్ని సానుకూల కోణంలో చూశారు. టీ20 క్రికెట్ అనేది కేవలం ఎక్కువ పరుగులు చేయడం మాత్రమే కాదు, తక్కువ బంతుల్లో ఎక్కువ ఇంపాక్ట్ చూపించడం అని ఆయన



అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 11 బంతులు ఆడి కేవలం 10 పరుగులు మాత్రమే చేశాడు. ఆ సమయంలో అతడు క్లీన్ హిట్టింగ్ చేయలేక స్ట్రగుల్ అవుతున్నట్లు కనిపించింది. ఒకవేళ అభిషేక్ అలాగే క్రీజులో ఉండి మరిన్ని బంతులు వృథా చేసి ఉంటే, రన్ రేట్ తగ్గిపోయేదని నాయర్ పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్ ఫామ్‌లో లేనప్పుడు లేదా బంతిని సరిగ్గా టైమ్ చేయలేనప్పుడు, త్వరగా అవుట్ అయిపోవడమే మంచిదని, దీనివల్ల తర్వాతి వచ్చే బ్యాటర్లకు ఎక్కువ సమయం దొరుకుతుందని ఆయన వివరించారు. అభిషేక్ నాయర్ తన వాదనను సమర్థిస్తూ షాయ్ హోప్ ఉదాహరణను కూడా ప్రస్తావించారు. వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ పవర్‌ప్లే అంతా ఆడి ఆ తర్వాత అవుట్ అయ్యాడని, అది ఆ జట్టుకు నష్టం కలిగించిందని గుర్తు చేశారు. అదే రీతిలో అభిషేక్ శర్మ కూడా 9 బంతుల్లో 9 పరుగులు చేస్తున్నప్పుడు మరింత సమయం తీసుకోవాలని చూడకుండా, షాట్లు ఆడబోయి అవుట్ అవ్వడం సరైన నిర్ణయమేనని నాయర్ అన్నారు. దీనివల్ల సంజు శాంసన్, తిలక్ వర్మ వంటి ఆటగాళ్లకు ఇన్నింగ్స్ నిర్మించడానికి తగినంత సమయం లభించిందని ఆయన విశ్లేషించారు. టీమిండియా గెలవాలంటే రన్ రేట్ పడిపోకుండా చూసుకోవడం ముఖ్యం కాబట్టి, అభిషేక్ శర్మ తన వికెట్ త్యాగం చేయడం జట్టుకే లాభం చేకూర్చిందని ఆయన చమత్కరించారు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విఫలమైనప్పటికీ, టీమిండియాను సంజు శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంజు కేవలం 50 బంతుల్లోనే 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడికి తోడుగా తిలక్ వర్మ 27 పరుగుల కీలక సహకారం అందించగా, చివర్లో శివమ్ దూబే మెరుపులు మెరిపించాడు. ఒకవేళ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎక్కువ బంతులు ఆడి స్లోగా పరుగులు చేసి ఉంటే, లక్ష్యం మరింత కష్టమయ్యేదని అభిమానులు కూడా ఇప్పుడు నాయర్ మాటలతో ఏకీభవిస్తున్నారు. అయితే సెమీఫైనల్ వంటి పెద్ద మ్యాచుల్లో అభిషేక్ శర్మ తన సహజసిద్ధమైన దూకుడును ప్రదర్శించి, కనీసం పవర్‌ప్లేలో మెరుపులు మెరిపించాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ముఖ్యంగా అభిషేక్ శర్మ ఫీల్డింగ్ లోపాలు జట్టుకు ఆందోళన కలిగిస్తున్నాయి. వెస్టిండీస్ ఇన్నింగ్స్ సమయంలో రెండు లాలీపాప్ వంటి క్యాచ్‌లను జారవిడచడం చూస్తుంటే, అతడు మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపిస్తోంది. గిల్, సంజు శాంసన్ వంటి సీనియర్ ప్లేయర్లు ఒకవైపు రాణిస్తుంటే, యువ ఆటగాడైన అభిషేక్ పై ఒత్తిడి పెరగడం సహజమే. అయితే సెమీఫైనల్లో ఇంగ్లాండ్ వంటి బలమైన ప్రత్యర్థితో తలపడేటప్పుడు ఫీల్డింగ్ మిస్టేక్స్ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కోచ్ గంభీర్ కూడా ఫీల్డింగ్ విషయంలో రాజీ పడకూడదని ఆటగాళ్లను హెచ్చరించిన నేపథ్యంలో, సెమీస్ నాటికి అభిషేక్ తన లోపాలను సరిదిద్దుకుంటాడని భావిస్తున్నారు. మొత్తానికి 2026 టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ పోరుకు సర్వం సిద్ధమైంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్-ఇంగ్లాండ్ తలపడనున్నాయి. అభిషేక్ శర్మ తనను తాను నిరూపించుకోవడానికి ఇదొక సువర్ణావకాశం. ఒకవేళ ఇక్కడ కూడా విఫలమైతే, టీమిండియాలో అతడి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. నాయర్ అన్నట్లు వికెట్ త్యాగం చేయడం అప్పుడప్పుడు జట్టుకు మేలు చేయవచ్చు కానీ, ఒక ఓపెనర్‌గా జట్టుకు అదిరిపోయే ఆరంభం ఇవ్వడమే అతడి అసలు బాధ్యత. మరి వాంఖడే గడ్డపై ఈ యంగ్ సెన్సేషన్ పుంజుకుంటాడా? లేక తన పేలవ ప్రదర్శనను కొనసాగిస్తాడా? అనేది తెలియాలంటే మరో మూడు రోజులు వేచి చూడాల్సిందే.

# షాక్ ఆటగాళ్లకు ఫైన్ వేసిన పీసీబీ!

2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. దీని పరిణామాలు ఆటగాళ్లపై గట్టిగానే ఉంటోంది. పాకిస్తాన్ జట్టు పేలవమైన ప్రదర్శనకు సంబంధించి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. ప్రతి ఆటగాడికి జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించింది. పాకిస్తాన్ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన తర్వాత ఈ శిక్ష వేశారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, పీసీబీ స్వయంగా ఆటగాళ్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేస్తుంది, ఇది చాలా ఆశ్చర్యకరమైన నిర్ణయంగా కూడా చెబుతున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ 8 రౌండ్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమించింది. పాకిస్తాన్ సెమీ-ఫైనల్‌కు చేరుకోలేకపోయిన వరుసగా ఇది నాల్గో ఐసీసీ టోర్నమెంట్. అందుకే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కఠినమైన చర్యలు తీసుకుంది. మీడియా నివేదికల ప్రకారం, పీసీబీ ప్రతి ఆటగాడికి 5 మిలియన్ పాకిస్తానీ రూపాయలు (సుమారు 1.6 మిలియన్ భారతీయ రూపాయలు) జరిమానా విధించింది. ఈ జరిమానా ప్రపంచ కప్‌లో పాల్గొన్న జట్టు సభ్యులందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా జట్టు ఇప్పటికే విమర్శలను ఎదుర్కొంటున్నందున, పాకిస్తాన్ క్రికెటర్లకు ఇది భారీ మొత్తం అని చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని పీసీబీ స్వయంగా తిరిగి తీసుకోనుంది. ఆటగాళ్లు తమ జీతాలు,




మ్యాచ్ ఫీజులు లేదా ఇతర చెల్లింపుల నుంచి తగ్గింపులను భరించాల్సి ఉంటుంది. శ్రీలంకలో జరిగిన టీ20 ప్రపంచ కప్2026 లో పాకిస్తాన్ తన అన్ని మ్యాచ్‌లు ఆడింది, కానీ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. వారు నెదర్లాండ్స్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించడం ద్వారా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అయితే, ఆ మ్యాచ్‌లో కూడా వారు తృటిలో ఓటమిని తప్పించుకున్నారు. ఆ తర్వాత వారు యూఎస్ఏ పై 32 పరుగుల తేడాతో గెలిచారు, కానీ టీమ్ ఇండియాపై 61 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వారు ఏదో విధంగా సూపర్ 8లోకి ప్రవేశించారు. అయితే, సూపర్ 8లలో వారి ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రద్దు అయిన తర్వాత, వారు ఇంగ్లాండ్ చేతిలో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత వారు శ్రీలంకపై గెలిచారు, కానీ నెట్ రన్ రేట్ కారణంగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

# శివమ్ దూబే వల్లే గెలిచాం: గంభీర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే..



సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు.సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.'అని గంభీర్ స్పష్టం చేశాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999